

ధర్నాలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

### కేసీఆర్ పోడు పట్టాలిస్తే.. కాంగ్రెస్ అడ్డుకుంటుంది

**- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆసిఫాబాద్**

గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు కేసీఆర్ పోడు పట్టాలిచ్చి ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను సాగు చేసుకోకుండా అడ్డుకుంటోంది. టైగర్ కారిడార్ పేరుతో ఏకంగా గిరిజనుల భూములను పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు చేస్తోంది. టైగర్ కారిడార్ పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ను వెంటనే రద్దుచేయకపోతే మరో కుమ్రం భీం పోరాటం మొదలవుతుంది. ఆదివాసీలమంతా ఏకమై ఆందోళనలు చేపడుతాం. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం.



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

### గిరిజనులపై ఎందుకీ వివక్ష

**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు**

ఇంద్రవెల్లి సభలో ఆదివాసీలపై ప్రేమను ఒలకబోసిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు మాత్రం ఆసిఫాబాద్ జిల్లా గిరిజనులపై వివక్ష చూపుతున్నారు. హైదరాబాద్‌లో అడవులను ఆక్రమించుకునేందుకు జింకలను చంపిన రేవంత్ రెడ్డి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పులులను కాపాడేందుకు ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. ఆదివాసీలు నివసించే ఆసిఫాబాద్ అడవులను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్‌కు రూ.7,700 కోట్ల నిధులు తెస్తున్న అధికారులు ఐటీడీఏను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారో చెప్పాలి. ఆదివాసీల బతుకులు ఆగం చేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు.



ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీ తీస్తున్న గిరిజనులు

### అధికారులను గ్రామాల్లోకి రానివ్వం

**- కోట్నాక్ విజయ్ కుమార్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు**



జీవో 49ని రద్దుచేయకపోతే అడవుల్లోకి అటవీ అధికారులను రానివ్వం. టైగర్ కారిడార్ పేరుతో పోడు రైతులను వేధిస్తే అటవీ అధికారులను ప్రతిఘటిస్తాం. ఆదివాసీలను కేవలం ఓటు బ్యాంకుగానే పార్టీలు వాడుకుంటున్నాయే తప్ప వారి కోసం ఏ పార్టీ కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. ఆదివాసీలను అంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుంది. రాంజీగోండ్ కుమ్రం భీం స్ఫూర్తితో ఆదివాసులు మరోపోరాటానికి సిద్ధం కావాలి.

# టైగర్ కారిడార్‌పై కన్నెర్ర

## 'టైగర్ కన్జర్వేషన్'కు వ్యతిరేకంగా తుడుం మోగించిన ఆదివాసులు

- జిల్లా కేంద్రంలో వందలాది మందితో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- జీవో 49ను రద్దు చేయాలని డిమాండ్
- సర్కారు, అటవీశాఖకు వ్యతిరేకంగా నినాదాలు
- బతుకులు ఆగం చేస్తే సహించేది లేదని హెచ్చరిక
- మద్దతుగా నిలిచిన నేతలు, ప్రజా సంఘాలు

### సంఘటిత పోరాటం చేస్తాం

**- కోనేరు కోనప్ప, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే**



జీవో 49 రద్దు కోసం ఆదివాసీలతో కలిసి సంఘటితంగా పోరాటం చేస్తాం. ప్రతి గ్రామంలో ఉద్యమాలు చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి గ్రామంలో నల్ల జెండాలతో నిరసనలు చేపడుతాం. టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా గిరిజనులు చేపట్టే ప్రతి ఉద్యంలో పాల్గొని వారి వెన్నంటే ఉంటాము. టైగర్ కారిడార్‌తో గిరిజనుల బతుకులు ఆగమవుతాయి. అటవీ ప్రాంతాల్లో వందేళ్లకు ముందే ఏర్పడిన గ్రామాలకు రోడ్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. కనీసం తాగు నీటి కోసం బోర్లు కూడా వేయనీయడం లేదు. ఇది న్యాయం కాదు.

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తుండడంపై ఆదివాసులు కన్నెర్ర చేశారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తుడుం మోగించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. శనివారం జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకొని భారీ ర్యాలీ తీశారు. తుడుం వాయిద్యాలతో కుమ్రం భీం చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు చేరుకొని అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి వివేకానంద చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు కదం తొక్కారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎంపీ సోయం బాపూరావ్ మద్దతు ప్రకటించి.. ఆందోళనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన ఆందోళన సుమారు ఐదుగంటల పాటు కొనసాగింది. సర్కారు వెనక్కి తగ్గకపోతే మరో కుమ్రం భీం పోరాటం మొదలవుతుందని హెచ్చరించారు.



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆదివాసులు

### ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**- సోయం బాపూరావ్, మాజీ ఎంపీ**



టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. జీఓ 49 రద్దుచేసేవరకు పోరాడుతాం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కారణంగానే జీవో 49 వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందించింది. ఆదివాసీలను అడువుల నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే టైగర్ కారిడార్ పేరుతో ఈ జీవోను తీసుకువచ్చారు. ఈ జీవో రద్దుకోసం రాష్ట్ర ప తిని కలిసేందుకు ప్రయత్నం చేస్తాం. ఆదివాసీల సం ఘాలను కలుపుకొని పోరాటాలు చేస్తాం. ఇకపై గిరిజనుల మీద అధికారులు వేధింపులకు పాల్పడితే.. అటవీ అధికారులపై కూడా గిరిజనులు కేసులు పెట్టాలి.



రామకృష్ణాపూర్ : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## భక్తి శ్రద్ధలతో బక్రీద్

**మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో** శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులు, ఈద్గాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు సందేశాలు ఇచ్చారు. పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖుర్బానీ చేసి పేదలకు దానం చేశారు. బంధువులు, ఆత్మీయులను ఇళ్లకు పిలిచి విందు ఇచ్చారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మంచిర్యాల ఏసీసీ : ముస్లిం పెద్దలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

## కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించిన మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్, జూన్ 7 : మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తన ఇంటిలో టీవీలో వీక్షించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం, వాస్తవాలు' అనే అంశంపై ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కీలకమైన వివరాలు వెల్లడించారు. అనంతరం దివాకర్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు అని, మేడిగడ్డ దగ్గర ఒక పిల్లర్ కుంగిందన్న సాకుతో మొత్తం ప్రాజెక్టుపైనే దుష్ప్రచారం చేశారని, నీళ్లు ఆపకుండా వదిలేయడం వల్ల నేడు పంటలు ఎండిపోయాయన్నారు. సాగు, తాగునీటి అవసరాలను తీర్చే ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతసేపు నిందలు వేసే పనినే పెట్టుకున్నదని, దానికి మరమ్మతులు చేసి వాడుకోవాలన్న అంశంపై ఏనాడూ దృష్టి సారించలేదని విమర్శించారు.



హరీశ్‌రావు ప్రసంగాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

## రోడ్డు పనులను అడ్డుకున్న అటవీ అధికారులు

తాండూర్, జూన్7 : తాండూర్ మండలం బెజ్జాలా గ్రామానికి కొత్తగా బీటీ రోడ్డు మంజూరు కాగా, ఆ పనులు చేపట్టే విషయమై వివాదం చోటు చేసుకుంది. బెజ్జాల గ్రామానికి రోడ్డు వేస్తుండగా శనివారం బెల్లంపల్లి రేంజ్ అధికారి పూర్ణచందర్ రావు సిబ్బందితో వచ్చి అడ్డుకున్నారు. రోడ్డు స్థలం అటవీశాఖ పరిధిలో ఉన్నందున అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఇట్టి స్థలం తమదేనని.. పట్టాలు కూడా ఉన్నాయని గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సీఐ కుమార స్వామి, ఎస్ఐ సౌమ్య, మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను సముదాయించారు. అటవీ అనుమతులు తీసుకొని రోడ్డు పనులు చేపట్టాలని అధికారులు తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కరించి తమకు రోడ్డు సౌకర్యం కలిగేలా చూడాలని గిరిజనులు కోరారు.

## రుణమాఫీ కాలే.. పంట నష్టం రాలే

- రైతు గోస పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ



వ్యవసాయాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్

కౌటాల, జూన్ 7 : కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయని, ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని, పంట నష్టం ఇవ్వలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం కనికి గ్రామంలో రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని, పంట నష్ట పరిహారం కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయన వ్యవసాయ అధికారిని ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు, పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపినా ఇప్పటి వరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ సర్కారులో పంటలు వేసే సమయానికల్లా రైతులకు రైతు బంధు, విత్తనాలు, ఎరువులు అందేవని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కర్షకుల గోస పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు, ప్రజలకు అండగా ఉంటుందని ధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట నియోజక వర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు వెంకటేశ్, కార్తీక్, రాజశేఖర్, రాజు, మనోహర్, శ్రీనివాస్ తదితరులున్నారు.